03

## సంతానలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు



RNI: APTEL/26/A8235

# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక



అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090



నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -20 | ఆదివారం 18 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-




## కోలాహలంగా కార్పొరేషన్ నామినేషన్లు.. పాల్గొన్న కాకాణి

**-72 డివిజన్లతో పాటు మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యం**

నెల్లూరు,(అక్షర దర్శిని):

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు కార్యక్రమం కోలాహలంగా సాగింది. నగరంలోని 59వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి కిషన్, 61వ డివిజన్ అభ్యర్థి వేలూరు ఉమామహేష్ నామినేషన్ల దాఖలు కార్యక్రమంలో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, నెల్లూరు సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో కలిసి అభ్యర్థులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి మహాలక్ష్మమ్మ దేవస్థానంలో కాకాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, నెల్లూరు నగర ప్రజలకు మంచి జరగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీస్సులే అభ్యర్థులకు అసలైన బలమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై అవగాహన కలిగి, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేసే నాయకులను పార్టీ అభ్యర్థులుగా ఎంపిక చేశామని, ప్రజలు వారిని ఆదరిస్తారనే నమ్మకం ఉందని అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నామినేషన్ల

...మిగతా 3లో



# దేశ రాజకీయాల్లోనే జగన్ అత్యంత 'రేర్ పీస్'!

**కేసుల విచారణ పూర్తయ్యే వరకు రాజకీయాలకు దూరంగా ఉండాలి..**

**కల్తీ నెయ్యి వ్యవహారంలో ఈడీ చర్యలు...**

**రూ.130 కోట్ల ఆస్తుల అటాచ్‌మెంట్‌పై సోమిరెడ్డి వ్యాఖ్యలు..**

నెల్లూరు,(అక్షర దర్శిని):
అవినీతి, అక్రమాల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశ రాజకీయాల్లోనే ఓ 'రేర్ పీస్'గా మిగిలారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. జగన్‌పై ఉన్న కేసుల విచారణ పూర్తయ్యే వరకు రాజకీయాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. నెల్లూరు లో శనివారం ఆయన మీడియాతో ఆయన మాట్లాడుతూ.. జగన్‌కు సంబంధించిన కేసుల విచారణకే సీబీఐ, ఈడీ వంటి జాతీయ దర్యాప్తు సంస్థలకు సమయం సరిపోని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

**కల్తీ నెయ్యి వ్యవహారంపై తీవ్ర విమర్శలు..**

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనే ఆరోపణలు భక్తుల మనోభావాలను దెబ్బతీశాయని సోమిరెడ్డి అన్నారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు, సంస్థలకు చెందిన సుమారు రూ.130 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్లు పేర్కొన్నారు. బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ, వైష్ణవీ డెయిరీ తదితర సంస్థలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

**రూ.43 వేల కోట్ల కేసులో రోజువారీ విచారణ..** జగన్ అక్రమాస్తుల కేసులో

...మిగతా 4లో

## ఆత్మకూరులో ఆనం జోష్.. ఎన్డీఏ శ్రేణుల్లో నూతనోత్సాహం!





- 28 వార్డులకు కూటమి అభ్యర్థుల ప్రకటన
- రవితేజ కళ్యాణ మండపంలో సందడి

**ఆత్మకూరు, (అక్షర దర్శిని):** : ఆత్మకూరు పురపాలక ఎన్నికల సమరానికి ఎన్డీఏ కూటమి సమరశంఖం పూరించింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి తరఫున 28 వార్డుల్లో పోటీ చేయనున్న అభ్యర్థులను రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం ప్రకటించారు. ఆత్మకూరులోని రవితేజ కళ్యాణ మండపంలో నిర్వహించిన భారీ సభలో అభ్యర్థుల జాబితాను విడుదల చేయడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. హర్షధ్వానాలు, కేరింతల మధ్య అభ్యర్థుల పేర్ల ప్రకటనతో సభా ప్రాంగణం సందడిగా మారింది. పురపాలక ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వయంగా అభ్యర్థులను ప్రకటించడంతో ఆత్మకూరు రాజకీయాల్లో ఎన్నికల వేడి మరింత పెరిగింది. కూటమి శ్రేణులు సమష్టిగా పనిచేసి అన్ని వార్డుల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగేందుకు సిద్ధమవుతున్నాయి. ఆత్మకూరు పట్టణ సమగ్ర అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సమస్యలను పరిష్కరించడం, రహదారులు, వీధి దీపాల సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటు సాగునీరు, విద్యుత్, వైద్య, విద్యా రంగాలు, పారిశ్రామిక వసతులకు ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలిపారు. 28 వార్డులకు అభ్యర్థులను ప్రకటించడంతో ఆత్మకూరు పురపాలక ఎన్నికల పోరు కీలక దశకు చేరుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం కనిపిస్తుండగా, రానున్న ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించాలనే లక్ష్యంతో కూటమి శ్రేణులు ఎన్నికల కార్యాచరణకు సిద్ధమవుతున్నాయి. మంత్రి ఆనం ఆధ్వర్యంలో జరిగిన అభ్యర్థుల ప్రకటన సభ ఆత్మకూరు పురపాలక ఎన్నికల బరిలో ఎన్డీఏ కూటమికి కీలక ఘట్టంగా నిలిచింది.



## నెల్లూరు మేయర్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు



నెల్లూరు,(అక్షర దర్శిని): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఉదయం మేయర్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి ఆనం విజయ్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మేయర్ అభ్యర్థి రూప్ కుమార్ యాదవ్ రిటర్నింగ్ అధికారి వెంకటేశ్వర్లుకు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ప్రధాన పార్టీలకు చెందిన మేయర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో నెల్లూరు నగర రాజకీయాల్లో ఎన్నికల సందడి నెలకొంది.



# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- అభ్యర్థులందరికీ నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అభ్యర్థులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 14న ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కొంతమంది అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటున్నారని, కొన్ని ప్రాంతాల్లో నామినేషన్ పత్రాలను లాక్కుంటున్నారని రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిబంధనల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయాలనుకునే అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ అధికారుల కార్యాలయాలతో పాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని ఆయన సూచించారు.

# ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక నిఘా




- కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ఫిర్యాదుల కోసం 0861-2331261కు సంప్రదించాలి
- రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి



**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను శనివారం ఉదయం ఆయన పరిశీలించి, వివిధ పర్యవేక్షణ బృందాల విధులు, బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ఫిర్యాదులు, సమాచారం కోసం ప్రజలు 0861-2331261 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఉల్లంఘనల గుర్తింపు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, మీడియా పరిశీలన, ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ఎన్నికల ఖర్చులపై నిఘా**

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు చేసే ఖర్చులను నిబంధనల ప్రకారం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల వ్యయ వివరాలను పారదర్శకంగా నమోదు చేయడంతో పాటు, నగదు, వస్తువులు లేదా ఇతర ప్రలోభాలను పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందితే సంబంధిత బృందాలు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



**రాజకీయ ప్రకటనలకు ముందస్తు ధ్రువీకరణ**

టెలివిజన్ ఛానళ్లు, వార్తాపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమయ్యే లేదా ప్రసారమయ్యే ఎన్నికల ప్రచారం, రాజకీయ ప్రకటనలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. వర్తించే ఎన్నికల నిబంధనల ప్రకారం రాజకీయ ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరిగా పొందాలని తెలిపారు.

**సమన్వయంతో విధులు నిర్వహించాలి** ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, మీడియా పర్యవేక్షణ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి బృందం అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీనరసింహారావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఓఏఎండిసి తుది విడత డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల

- ఈ నెల 24 నుంచి రిజిస్ట్రేషన్లు.. 30న సీట్ల కేటాయింపు

**వెంకటాచలం, అక్షర దర్శిని :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ఓ ఏ ఎం డి సి--2026 మూడో, తుది విడత ప్రవేశాల షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ, కళాశాల విద్యా కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రవేశాల ప్రక్రియ అక్టోబర్ 24 నుంచి ప్రారంభం కానుంది. ఈ విడతలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు నిర్ణీత గడువులో రిజిస్ట్రేషన్‌తో పాటు ఇతర ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన అర్హులైన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీపీఏ, బీఎఫ్ఏ తదితర డిగ్రీ కోర్సులతో పాటు అర్హత ఉన్న ఐదేళ్ల సమీకృత పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ విడత అవకాశం కల్పిస్తోంది. ప్రవేశాల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 24 నుంచి 26 వరకు విద్యార్థుల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తారు. అక్టోబర్ 25 నుంచి 27 వరకు హెచ్ఎల్‌సీ కేంద్రాల్లో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది. అక్టోబర్ 26, 27 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. అక్టోబర్ 28న వెబ్ ఆప్షన్లలో మార్పులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

# భక్తి పారవశ్యంలో పెంచలకోన క్షేత్రం..

- వైభవంగా స్వామివారి కల్యాణోత్సవం
- శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం...
- ఒక్కరోజే రూ.6.77 లక్షల ఆదాయం



**పెంచలకోన,(అక్షర దర్శిని):** కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులచే కొలువబడుతున్న శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్యక్షేత్రం శనివారం భక్తజన సందోహంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, స్వామివారి కృపాకటాక్షాలు పొందారు. తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించగా, ఉదయం 10.30 గంటలకు ప్రధానార్చకులు, వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ స్వామివారి కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ ఆధ్యాత్మిక వేడుక భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది.

**ఒక్కరోజే రూ.6.77 లక్షల ఆదాయం**

స్వామివారి దివ్యదర్శనం కోసం శనివారం సాయంత్రం 6 గంటల వరకు మొత్తం 5,957 మంది భక్తులు పెంచలకోన క్షేత్రాన్ని సందర్శించారు.





స్వామివారి నిత్య అన్నదాన పథకంలో భాగంగా 2,400 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల విరాళాలు, దర్శన టికెట్లు, పూజలు, ప్రసాదాల విక్రయాలు, వసతి గృహాల ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.6,77,598 ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమ చేశారు.

**భక్తులకు సౌకర్యవంతమైన ఏర్పాట్లు**

క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, నిత్య అన్నదాన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించారు. ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి జనార్దన్ రెడ్డి పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. స్వామివారి దర్శనం, తీర్థప్రసాదాల స్వీకరణతో పెంచలకోన క్షేత్రం భక్తి, ఆధ్యాత్మికతలతో అలరారింది.

# రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి

- పెయిడ్ న్యూస్‌పై నిరంతర పర్యవేక్షణ
- ప్రకటనల ప్రచారానికి కనీసం మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేయాలి
- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వివిధ మాధ్యమాల్లో రాజకీయ ప్రకటనలను ప్రచారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో పెయిడ్ న్యూస్‌పై కూడా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఎంసీఎంసీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కమిటీలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ నందన్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, బుచ్చిరెడ్డిపాలెం మున్సిపల్ కమిషనర్ చినబాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వేణుగోపాల్ రెడ్డి సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, ఈ-పేపర్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, బహిరంగ ప్రదేశాల్లో ఆడియో, వీడియో ప్రదర్శనల ద్వారా ప్రచారం చేసే రాజకీయ ప్రకటనలను కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఒక అభ్యర్థికి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా వార్తల రూపంలో ప్రచురించే పెయిడ్ న్యూస్‌ను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిశీలిస్తుందని వివరించారు.

### మూడు రోజుల ముందుగా దరఖాస్తు

రాజకీయ ప్రకటనల ధ్రువీకరణ కోసం ప్రకటన ప్రసారం, ప్రచారం లేదా ప్రదర్శన ప్రారంభ తేదీకి కనీసం మూడు రోజుల ముందుగా నిర్దేశిత ప్రొఫార్మాలో ఎంసీఎంసీకి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన అనుబంధం-ఎ నమూనాలో దరఖాస్తుతో పాటు ప్రతిపాదిత ప్రకటనకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రూపంలోని రెండు కాపీలు, ధ్రువీకరించిన ట్రాన్స్‌క్రిప్ట్, ప్రకటన తయారీ ఖర్చు, ప్రసారం లేదా ప్రదర్శనకు అయ్యే అంచనా వ్యయ వివరాలను సమర్పించాలని తెలిపారు.ప్రకటనలు ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఉండాలని, కమిటీ సూచించిన మార్పులు లేదా తొలగింపులను సంబంధిత పార్టీలు, అభ్యర్థులు నిర్ణీత సమయంలో అమలు చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ ముగియడానికి నిర్ణయించిన సమయానికి ముందు 48 గంటల నిషేధిత కాలంలో ధ్రువీకరించిన ప్రకటనలను ఎన్నికల ప్రచారానికి ఉపయోగించరాదని పేర్కొన్నారు.

### కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ సెల్

రాజకీయ ప్రకటనల ముందస్తు ధ్రువీకరణ, అనుమతులు, పెయిడ్ న్యూస్ పర్యవేక్షణకు సంబంధించిన వివరాల కోసం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ సెల్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం, అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా సంస్థలు రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు.

# ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



- గో సంరక్షణ, నిత్యాన్నదాన పథకాలకు మరో రూ.లక్ష విరాళం..

**పెంచలకోన,(అక్షర దర్శిని):**నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోన క్షేత్రంలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం, గో సంరక్షణ, నిత్యాన్నదాన పథకాలకు భక్తులు విరాళాలు అందజేశారు. శనివారం సంగం వాస్తవ్యులు చీకుర్తి ఎరుకలయ్య, సంపూర్ణమ్మ దంపతులు ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి రూ.1.50 లక్షల నగదును ఆలయ ముఖ్య అర్చకులు శశి స్వామి ద్వారా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వినోద్ కుమార్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణకు అందజేశారు. అలాగే నెల్లూరు మూలాపేటకు చెందిన చల్లా నరేంద్రరెడ్డి, పద్మజ దంపతులు గో సంరక్షణ నిధికి రూ.50 వేలను ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. చల్లా లక్ష్మీనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని రత్నమ్మ నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలను ఆన్‌లైన్ ద్వారా అందించారు. అదేవిధంగా ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి మరో రూ.50 వేల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు. మొత్తంగా ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 లక్షలు, గో సంరక్షణ నిధికి రూ.50 వేలు, నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు కలిపి మొత్తం రూ.3 లక్షల విరాళాలు అందాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వినోద్ కుమార్, సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.



# కోలాహలంగా కార్పొరేషన్ నామినేషన్లు.. పాల్గొన్న కాకాణి



### మొదటి పేజీ తరువాయి

దాఖలు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలతో మమేకమవుతూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థలోని మొత్తం 72 డివిజన్లలో విజయం సాధించడంతో పాటు మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కానుకగా అందించడమే తమ లక్ష్యమని కాకాణి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తూ ప్రజల మద్దతుతో విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.ఎన్నికల ప్రక్రియలో పోలీసులు, ప్రభుత్వ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, అన్ని పార్టీల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం సమాన అవకాశాలు కల్పిస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరికీ కాకాణి అభినందనలు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో పాటు దుర్గామాత దీవెనలు పొంది ఎన్నికల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.






# ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

- ఫిర్యాదులు, సందేహాల నివృత్తికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్
- ఫోన్ నంబర్ 0861-2331261

**నెల్లూరు,(అక్షర దర్శిని):**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు నెల్లూరు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రజలకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసేందుకు కూడా ఈ కేంద్రం ద్వారా సేవలు అందించనున్నట్లు వెల్లడించారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఉల్లంఘనలు ఎక్కడైనా గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలు ఉన్నా ప్రజలు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు.ఫిర్యాదులు చేయడంతో పాటు ఎన్నికలకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు 0861-2331261 హెల్ప్‌డెస్క్/కాల్ సెంటర్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ప్రజలు సహకరించాలని, ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సంబంధిత యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# సంతానలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు

**పెంచలకోన,(అక్షర దర్శిని):**సిరిసంపదలు, సంతాన సౌభాగ్యాలను ప్రసాదించే జగన్మాతగా కొలువుదీరిన ఆదిలక్ష్మి అమ్మవారు శనివారం పెంచలకోన క్షేత్రంలో సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామివారి పట్టమహిషి ఆదిలక్ష్మి అమ్మవారికి ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విశేష పూజా కార్యక్రమాలు భక్తి ప్రపత్తులతో వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి సంప్రదాయబద్ధంగా వస్త్ర సమర్పణ చేసి, వివిధ రకాల సుగంధ పుష్పాలతో మనోహరంగా అలంకరించారు. అనంతరం ఉదయం 10 గంటలకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారిని పద్మపీఠంపై సుందరంగా అలంకరించి ప్రాకారోత్సవం నిర్వహించారు. అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. లోకక్షేమం, కుటుంబ సౌభాగ్యం, సంతాన ప్రాప్తి కలగాలని జగన్మాతను ప్రార్థిస్తూ భక్తులు పూజలు చేశారు. శరన్నవరాత్రుల సందర్భంగా పెంచలకోన క్షేత్రం అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదిలక్ష్మి అమ్మవారి కరుణాకటాక్షాలు తమ కుటుంబాలపై ఉండాలని భక్తులు వేడుకుంటూ భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు.





# ఎన్నికల వేళ అక్రమ మద్యంపై ఎక్సైజ్ నిఘా

- ఆరు ప్రత్యేక బృందాలతో నిరంతర తనిఖీలు
- కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో అక్రమ మద్యం విక్రయదారుడి అరెస్ట్
- జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులు నాయుడు



**నెల్లూరు, (అక్షర దర్శిని) :** నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ చేపట్టింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు, మద్యం ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలను అరికట్టేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నగరవ్యాప్తంగా నిరంతర తనిఖీలు నిర్వహిస్తోంది.జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షణలో ఈ చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.ఎన్నికల సమయంలో అక్రమ మద్యం నిల్వలు, అనధికార విక్రయాలు, అక్రమ సరఫరాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సీఐ ఆధ్వర్యంలో రెండు బృందాలు, నెల్లూరు టాస్క్‌ఫోర్స్‌కు చెందిన ఈఎస్‌డీఎఫ్ బృందం ఒకటి, నెల్లూరు-1 ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మరో మూడు బృందాలు విధులు నిర్వహిస్తున్నాయి. ఈ బృందాలు ప్రతిరోజూ రాత్రి నుంచి తెల్లవారుజామున ఒంటి గంట వరకు, తిరిగి ఉదయం నాలుగు గంటల నుంచి పెట్రోలింగ్, తనిఖీలు చేపడుతున్నాయి. అక్టోబర్ 28న జరగనున్న నగరపాలక సంస్థ ఎన్నికల వరకు ఈ నిఘా కొనసాగనుంది.ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా అక్టోబర్ 17న నెల్లూరులోని కరెంట్ ఆఫీస్ సెంటర్ వద్ద అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్న రుద్ర రాజు వెంకట నరసరాజును నెల్లూరు-1 ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ అధికారులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 180 మి.లీ. పరిమాణం గల ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడిలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి. శ్రీధర్, హెడ్ కానిస్టేబుల్ కె. పెంచలయ్యలను ఉన్నతాధికారులు అభినందించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎక్సైజ్ చట్టాలను ఉల్లంఘించే వ్యక్తులు, లైసెన్సుదారులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు, మద్యం దుకాణాలు, బార్ల నిర్వాహకులు ఎక్సైజ్ శాఖకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.అక్టోబర్ 28 వరకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు.

# దేశ రాజకీయాల్లోనే జగన్ అత్యంత 'రేర్ పీస్'!



**మొదటి పేజీ తరువాయి**

సీబీఐ కోర్టు రోజువారీ విచారణ చేపట్టే పరిస్థితి వచ్చిందని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. విచారణ ప్రారంభమైతే వందలాది మంది సాక్షులను విచారించాల్సి ఉంటుందని, జగన్ కోర్టుకు హాజరు కావాల్సి వస్తుందని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో రూ.40 కోట్ల వ్యవహారంపైనా దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయని పేర్కొన్నారు.

**కల్తీ మద్యం కేసులోనూ ఆరోపణలు..** రాష్ట్రంలో రూ.3,500 కోట్ల కల్తీ మద్యం కుంభకోణం జరిగిందని ఆరోపించిన సోమిరెడ్డి.. ఈ వ్యవహారంలో పలువురు వైసీపీ నేతలు, ఇతర ప్రముఖులు విచారణను ఎదుర్కొంటున్నారని అన్నారు. వివిధ కేసుల కారణంగా రాష్ట్ర రాజకీయాలపై ప్రతికూల ప్రభావం పడుతోందని విమర్శించారు.

**అభివృద్ధిని గుర్తించని సాక్షి మీడియా..** కూటమి ప్రభుత్వ రెండేళ్ల రెండు నెలల పాలనలో రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, వేలాది ఉపాధి అవకాశాలు వస్తున్నప్పటికీ సాక్షి మీడియా వాటిని ప్రస్తావించడం లేదని సోమిరెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య విభేదాలు సృష్టించి, కూటమి పార్టీల మధ్య దూరం పెంచడమే ఆ మీడియా లక్ష్యమని విమర్శించారు.

**అద్వానీని ఆదర్శంగా తీసుకోవాలి..** గతంలో బీజేపీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ ఒక కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న సమయంలో పదవికి రాజీనామా చేశారని సోమిరెడ్డి గుర్తుచేశారు. అదే విధంగా జగన్ కూడా తనపై ఉన్న కేసుల విచారణ పూర్తయ్యే వరకు రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఆయన శ్రేయోభిలాషులు చొరవ తీసుకోవాలని అన్నారు. దేశానికి, రాష్ట్రానికి సేవలందించిన తెలుగు ప్రముఖులు జాతీయ స్థాయిలో కీర్తి గడించారని, ప్రస్తుత రాజకీయ పరిణామాల వల్ల తెలుగు ప్రజలు తలదించుకునే పరిస్థితి రావడం దురదృష్టకరమని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

# సమిష్టి కృషితో స్థానిక ఎన్నికల్లో విజయం సాధిద్దాం







- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి విజయాన్ని సాధించాలని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ముత్తుకూరు మండల పార్టీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ నాయకత్వానికి, క్షేత్రస్థాయి కార్యకర్తలకు కీలకమైన పరీక్ష అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రాజకీయ పరిస్థితులను అంచనా వేస్తూ, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా ఎన్నికల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల బాధ్యతలను ఇప్పటి నుంచే చేపట్టి, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవాలని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి విశ్వాసాన్ని పొందేలా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రతి ఓటరును కలిసి పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి ఏ విధంగా కృషి చేస్తామో వివరించాలని పిలుపునిచ్చారు.

### టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ గెలుపే లక్ష్యం

అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచార నిర్వహణ వరకు ప్రతి అంశంలోనూ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కాకాణి సూచించారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. టికెట్ ఎవరికి వచ్చినా వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి, పార్టీ అభ్యర్థి విజయమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థిత్వాల విషయంలో గందరగోళానికి తావివ్వకుండా నాయకులంతా ఒకే తాటిపై నిలిచి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాలని కోరారు.కూటమి నాయకులు ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని ఆరోపించిన కాకాణి, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉంటూ వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి, ప్రతి గ్రామంలోనూ విజయానికి అవసరమైన వ్యూహాలను అమలు చేయాలని సూచించారు.

### అధికారులు నిష్పాక్షికంగా వ్యవహరించాలి

ఎన్నికల నిర్వహణలో అధికారులు నిబంధనలకు అనుగుణంగా, నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని కాకాణి కోరారు. కొందరు అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభ్యర్థులపై అక్రమ కేసులు బనాయిస్తే చట్టపరంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారికి గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని పేర్కొన్న కాకాణి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకులకు మద్దతు లభించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రజాసేవే లక్ష్యం.. 21వ డివిజన్ అభివృద్ధే ధ్యేయం!





- జనసేన కూటమి అభ్యర్థిగా విజయలక్ష్మి గునుకుల నామినేషన్ దాఖలు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** ప్రజాసేవే లక్ష్యంగా, 21వ డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా జనసేన వీరమహిళ విజయలక్ష్మి గునుకుల శనివారం కూటమి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు, మద్దతుదారుల నడుమ ఆమె నామినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.జనసేన నాయకుడు కిషోర్ గునుకుల నివాసం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి బయలుదేరిన విజయలక్ష్మి గునుకుల, ఎనమలవారిదిన్నె వద్ద ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నామినేషన్ దాఖలు చేయడం కేవలం ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాదని, డివిజన్ ప్రజల పట్ల తమకున్న బాధ్యతకు, అభివృద్ధిపై తమకున్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఇప్పటికే డివిజన్‌లోని ప్రతి గడపను పలకరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, ప్రజలు చూపుతున్న ఆదరణ, నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత అంకితభావంతో సేవలందిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబ సమస్యను తమ సమస్యగా భావించి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, మంత్రి పొంగూరు నారాయణ అభివృద్ధి దృక్పథంతో ముందుకు సాగుతామని విజయలక్ష్మి పేర్కొన్నారు. తన భర్త, జనసేన నాయకుడు కిషోర్ గునుకుల సహకారంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. రాజకీయాలు పదవుల కోసం కాదని, ప్రజలకు సేవ చేసే అవకాశమని పేర్కొంటూ, 21వ డివిజన్‌లో ప్రతి కుటుంబం అభివృద్ధిలో భాగస్వామి అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.తన నామినేషన్ కార్యక్రమానికి హాజరై మద్దతుగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల నమ్మకమే తమ బలమని, వారి ఆశీస్సులతో 21వ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన సంకల్పమని విజయలక్ష్మి గునుకుల వెల్లడించారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.